జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా విఠల్‌రావు

ప్రజాశక్తి - పలాస

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా పీరుకట్ల విఠల్‌రావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మండలంలోని పెదంచల గ్రామానికి చెందిన ఆయన టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆరేళ్లుగా వ్యవహరిస్తున్నారు. గత టిడిపి ప్రభుత్వంలో 2015 నుంచి 2019 వరకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా పనిచేశారు. కూటమి ప్రభుత్వంలోనూ ఆయనకు మరోసారి చైర్మన్‌గా అవకాశం దక్కింది.

రెవెన్యూ నిస్తేజం

'రెవెన్యూ శాఖలో ఒకే సమస్యపై పదే పదే వినతులు ఎందుకు వస్తున్నాయి. ఇక నుంచైనా పరిస్థితి మారాలి. భూమి ఎవరిదో వారి పేరిటే ఉండాలి. జిల్లాస్థాయిలో రెవెన్యూ సమస్యల పరిష్కారంలో జాయింట్ కలెక్టర్‌దే నైతిక బాధ్యత'

- ఈ నెల తొమ్మిదో తేదీన రెవెన్యూశాఖపై చేపట్టిన సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

జిల్లా స్థాయి సమస్యలనూ జెసిలు పరిష్కరించడం లేదనే విషయం సిఎం మాటల్లో స్పష్టమవుతోంది. తహశీల్దార్లు కలెక్టరేట్‌లోని డి-సెక్షన్ అధికారుల సమాచారం మీదనే ఆధారపడుతుండడంతో, రైతుల సమస్యలన్నీ పరిష్కారమైపోయినట్లు ఉన్నతాధికారులు భావిస్తున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం అవి పరిష్కారం కాకపోవడంతో పదే పదే ఫిర్యాదులు వస్తున్నాయి. ఇవే భూ సమస్యల వినతులు పేరుకుపోవడానికి కారణమనే చర్చ నడుస్తోంది.

సోంపేట మండలం కొర్లాం భూ సమస్యలపై 'మీకోసం'లో ఫిర్యాదు చేస్తున్న రైతులు (ఫైల్)

- **యజమానులే తమ భూమి అని నిరూపించుకోవాల్సిన దుస్థితి**
- **కోర్టుకు వెళ్లిపోవాలంటూ ఒక్కోసారి అధికారుల సలహాలు**
- **జిల్లాస్థాయి సమస్యలకు జెసి బాధ్యత**
- **ఒకరిపై ఒకరు నెట్టుకునే పరిస్థితికి చెక్**

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

గత ప్రభుత్వం చేపట్టిన తప్పులతడక భూ సమగ్ర సర్వే ఫలితంగా అన్ని పత్రాలున్న యజమానులే తమ భూమి అని నిరూపించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇందుకోసం ఆర్‌డిఒ, జెసి, కలెక్టర్ కోర్టులో తమ పత్రాలను చూపించి తమ భూమి అని నిరూపించుకోవాల్సి వస్తోంది. కొన్నిసార్లు అదీ కుదరకపోవడంతో, కోర్టులకు వెళ్లాల్సిన పరిస్థితిని అధికారులు తీసుకొచ్చారు. సోంపేట మండలం కొర్లాం భూముల విషయమే అందుకు ఉదాహరణ. కొర్లాం గ్రామ రెవెన్యూ పరిధిలో సుమారు 800 ఎకరాల భూమి ఉంది. ఇందులోనే కొర్లాం గ్రామంతో పాటు లక్కవరం, బారువ, లక్ష్మీపురం, కుమ్మరిపాడు తదితర గ్రామాలకు చెందిన సుమారు 160 మందికి చెందిన 250 ఎకరాల భూమి ఉంది. వంశపారంపర్యంగా వీరి భూములు సంక్రమించినట్లు 1బి, అడంగల్ పత్రాలు, లింక్ డాక్యుమెంట్లు ఉన్నాయి. భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్లూ జరుగుతున్నాయి. క్రయవిక్రయాలూ నెరపుతున్నారు. రైతుల వద్ద ఉన్న డాక్యుమెంట్ల ఆధారంగా బ్యాంకులు రుణాలనూ అందిస్తున్నాయి. భూ సమగ్ర సర్వే తర్వాత మీ భూమి వెబ్‌సైట్‌లో వారి పేర్ల స్థానంలో ఒడిశా రాష్ట్రం జయంతపురం గ్రామానికి చెందిన భువనేశ్వర్ పాడి భక్షి పేరుతో ఇనాం భూములుగా కనిపిస్తున్నాయి. తమ సమస్యను పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు, తహశీల్దార్‌ను ఎన్నిసార్లు కలిశారో లెక్క లేదు. గ్రీవెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు వినతిపత్రం ఇచ్చారు. తర్వాత జెసిని ఆయన ఛాంబర్‌లోనే కలిశారు. మీ వద్ద డాక్యుమెంట్లు ఉన్నాయి కాబట్టి కోర్టుకు వెళ్లిపోతే మీకు హక్కులు సంక్రమిస్తాయంటూ జెసి సలహా ఇచ్చారు. దీంతో వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించే పనిలో ఉన్నారు. ఇది రెవెన్యూశాఖ వైఫల్యానికి అద్దం పడుతోంది.

వినతులపై సీరియస్ సమీక్షలు ఏవీ?

మండల స్థాయి, గ్రీవెన్స్‌లో ఎన్ని వినతులు వస్తున్నాయి, అవి ఎంతవరకు పరిష్కారమయ్యే పరిస్థితిని చూసే నాధుడే కరువయ్యాడు. బాధితులు అందించిన వినతిపత్రంపై జెసి రిఫరెన్స్ రాయడం, తహశీల్దార్లు అక్కడ నుంచి లేఖలు పంపడంతో అంతా పరిష్కారమైపోయినట్లుగా అధికారులు లెక్కల్లో రాసుకుంటున్న పరిస్థితి నెలకొంది. నిజానికి అవి పెండింగ్‌లో ఉండడంతో రైతులు పదేపదే గ్రీవెన్స్‌కు వస్తున్న పరిస్థితి నెలకొంది. మండలాలకు వస్తున్న వినతుల్లో ఆర్‌డిఒ, జెసి, కలెక్టర్ పరిధిలో ఉన్న సమస్యలపై తహశీల్దార్లు ఆర్‌డిఒలకు నివేదికలు అందించాల్సి ఉంటుంది. నెలలో ఇటువంటి వినతులు 20 నుంచి 30 వరకు వస్తుండడంతో, వారు పక్కన పెట్టేస్తున్న పరిస్థితి నెలకొంది. అదే విధంగా గ్రీవెన్స్‌కు నేరుగా వస్తున్న వినతులపై కలెక్టరేట్‌లోని డి-సెక్షన్ అధికారులు తహశీల్దార్లకు నివేదికలు పంపాల్సి ఉంటుంది. పని భారం పేరుతో వారు వినతులను పక్కన పెట్టేయడంతో అవి కిందికి వెళ్లడం లేదు. దీంతో ఆ సమస్య అలానే ఉండిపోవడంతో బాధితులు మళ్లీ గ్రీవెన్స్‌కు రావాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. సమస్యల పరిష్కారం కోసం ఒకరిపై ఒకరు నెట్టుకోవడం, వినతుల పరిష్కారంలో నిర్లిప్తత పోవాలంటే జిల్లాస్థాయిలో ఎప్పటికప్పుడు వీటిపై సీరియస్‌గా సమీక్షలు నిర్వహించాలి. ప్రతి నెలా రెవెన్యూ సమస్యలపై సమీక్షిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల పేర్కొన్న నేపథ్యంలో, జిల్లా అధికారులు ఏ రకమైన చర్యలు తీసుకోనున్నారో చూడాల్సి ఉంది.

ఎస్‌టి కమిషన్‌ను ఆశ్రయించిన గిరిజనులు

భూ సమగ్ర సర్వే సమయంలో హిరమండలం మండలంలోని చొర్లంగి రెవెన్యూ గ్రామంలో నలుగురు గిరిజనులకు చెందిన జిరాయితీ భూములు వెబ్‌ల్యాండ్‌లో గల్లంతయ్యాయి. స్థానిక విఆర్‌ఒ, సర్వేయర్ రెవెన్యూ రికార్డులను ట్యాంపరింగ్ చేసి వేరే వ్యక్తుల పేరు మీద మార్చేశారంటూ తహశీల్దార్ కార్యాలయం చుట్టూ రెండేళ్లుగా తిరుగుతూనే ఉన్నారు. విసిగిపోయిన గిరిజనులు ఈ ఏడాది ఆగస్టులో కలెక్టర్‌తో పాటు చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ ప్రత్యేక అధికారికి ఫిర్యాదు చేశారు. అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో, ఈ ఏడాది జూలైలో జాతీయ ఎస్‌సి, ఎస్‌టి కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కమిషన్ కలెక్టర్‌కు నోటీసు పంపింది. సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామంటూ హామీనిచ్చిన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆ బాధ్యతను టెక్కలి ఆర్‌డిఒ కృష్ణమూర్తికి అప్పగించారు. ఇప్పటికీ ఆ సమస్యకు అతీగతీ లేకుండా పోయింది. భూ సమస్య పరిష్కారం కోసం గిరిజనులు ఎస్‌టి కమిషన్‌ను ఆశ్రయించాల్సి రావడం రెవెన్యూ శాఖ వైఫల్యానికి మరో ఉదాహరణగా ఉంది.

డిఇఒకి వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

డిఇఒకి వంట కార్మికుల వినతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

మధ్యాహ్న భోజన పథకంలో ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాలల ఆరు నెలల పెండింగ్ బిల్లులు, వంట కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి, మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ఉత్తర డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా విద్యాశాఖాధికారి ఎ.రవిబాబుకు ఆయన కార్యాలయంలో గురువారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి నెలా ఐదో తేదీ లోపు బిల్లులు, వేతనాలు చెల్లించాలని కోరారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాలలలో మధ్యాహ్న భోజన పథకం బిల్లులు ఆరు నెలలుగా, మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఎనిమిది నెలలుగా బిల్లులు చెల్లించలేదని చెప్పారు. అప్పులు చేసి వండి పెట్టిన కళాశాలల వంట కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ పథకంలో పనిచేస్తున్న వారు అట్టడగు వర్గాలకు చెందిన వారని, రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబాల్లోని మహిళలని తెలిపారు. వంట కార్మికులకు ఇస్తున్న అతి తక్కువ వేతనాలూ సకాలంలో చెల్లించడం లేదన్నారు. రోజురోజుకూ నిత్యావసర సరుకుల ధరలు భారీగా పెరుగుతున్నాయని తెలిపారు. నెలల తరబడి మెనూ బిల్లులు, వేతనాలు పెండింగ్‌లో ఉండడం వల్ల కార్మికుల కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వంట కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం కనీసం రూ.పది వేల వేతనం ఇవ్వాలని కోరారు. ధరల పెరుగుదలకు అనుగుణంగా స్కూల్ విద్యార్థులకు మెనూ ఛార్జీలు కనీసం రూ.20, కళాశాల విద్యార్థులకు రూ. 30 ఇవ్వాలని కోరారు. వంట చేసేటప్పుడు అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. పాఠశాల, కళాశాలల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వమే వంట గ్యాస్‌ను సరఫరా చేయాలని, పథకం అమలుకు వంట షెడ్లు, మంచినీరు, కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని, గ్లౌజులు, మాస్కులు, యాప్రాన్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో యూనియన్ జిల్లా నాయకులు టి.ప్రవీణ ఉన్నారు.

త్వరితగతిన నిర్వాసిత కాలనీ పనులు

ప్రజాశక్తి - సంతబొమ్మాళి

మూలపేట పోర్టు నిర్వాసితుల కోసం సంతబొమ్మాళి మండలంలో నౌపడలో నిర్మిస్తున్న పునరావాస కాలనీ పనులను వేగవంతం చేయాలని ఆర్‌డిఒ కృష్ణమూర్తి అధికారులను ఆదేశించారు. నిర్వాసిత కాలనీని సందర్శించి చేపడుతున్న అభివృద్ధి పనులను గురువారం పరిశీలించారు. సిసి రోడ్లు, డ్రైనేజీ, ఎర్త్ ఫిల్లింగ్, విద్యుత్ సదుపాయాలు, శ్మశానం, చెరువుల పనులను అత్యంత ప్రాధాన్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పాఠశాల, అంగన్వాడీ భవనాల నిర్మాణ పనులు తొందరగా ప్రారంభించాలని సూచించారు. కాలనీలో బోర్ల తవ్వకాలను వెంటనే చేపట్టాలన్నారు. అనంతరం విష్ణుచక్రం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దార్ హేమసుందర్, ఎంపిడిఒ జయంతి ప్రసాద్, ఎపిఒ నరసింహమూర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ కృష్ణమూర్తి

విఇఆర్ ప్రాజెక్టులు వేగవంతం చేయాలి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

విశాఖ ఎకనామిక్ రీజియన్ (విఇఆర్)లో భాగంగా జిల్లాకు ప్రతిపాదించబడిన 12 భారీ ప్రాజెక్టులకు సంబంధించిన చర్యలు వేగవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. విఇఆర్‌లో ప్రతిపాదించిన ప్రాజెక్టులకు సంబంధించి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా అభివృద్ధికి సంబంధించి ప్రతిపాదిత ఏ ఏ ప్రాజెక్టులు ఏ దశలో ఉన్నది, వాటికి సంబంధించి భూసేకరణ, మౌలిక వసతులు, సమగ్ర ప్రాజెక్టు నివేదిక, అభిప్రాయ వ్యక్తీకరణ తదితర విషయాలను ప్రాజెక్టుల వారీగా అడిగి తెలుసుకున్నారు. వీటిని త్వరిత గతిని ముందుకు తీసుకెళ్లేందుకు చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ఏ ప్రాజెక్టులు ఎంత ప్రతిపాదిత పెట్టుబడితో వచ్చేందుకు అంగీకారం తెలుపుతున్నారు, వాటి వల్ల లభించే ఉపాధి కల్పన అవకాశాలపై చర్చించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీధర్, ఆర్‌డిఒలు కృష్ణమూర్తి, సాయి ప్రత్యూష, ముఖ్య ప్రణాళిక అధికారి లక్ష్మీప్రసన్న, పరిశ్రమలు, ఆర్‌అండ్‌బి, వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధకశాఖ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు తదితర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ధాన్యం సేకరణపై కంట్రోల్‌రూమ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ధాన్యం సేకరణ, రబీ సీజన్ ఎరువులకు సంబంధించి కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు ఏదైనా సమస్యలపై కంట్రోల్‌రూమ్ 9121863788 నంబరుకు ఫోన్ చేసి తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

జిల్లాలో సరిపడా యూరియా నిల్వలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో రైతులందరికీ రబీకి సంబంధించిన పంటలకు అవసరమైన యూరియా నిల్వలు ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. పంట విస్తీర్ణం బట్టి మండలాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాలు, పిఎసిఎస్, డిసిఎంఎస్, ప్రైవేటు డీలర్ల ద్వారా రైతులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రిటైల్‌లో 2750 మెట్రిక్ టన్నుల నిల్వ ఉందని పేర్కొన్నారు.

పారదర్శకంగా రెవెన్యూ సేవలు

ఆర్‌డిఒ వెంకటేష్

వజ్రపుకొత్తూరు: పారదర్శకంగా రెవెన్యూ సేవలు అందించాలని పలాస ఆర్‌డిఒ డి.వెంకటేష్ సూచించారు. మండలంలోని గునుపల్లి సచివాలయంలో రైతుల నుంచి గురువారం అర్జీలను స్వీకరించారు. గుణుపల్లిలో ఇటీవల కార్గో విమానాశ్రయం ఏర్పాటు సంబంధించి రైతులతో అభిప్రాయ సేకరణ చేస్తున్న సమయంలో రీసర్వేలో తలెత్తిన సమస్యల పరిష్కరించకుండా తిప్పుతున్నారని, లేదంటే డబ్బులు ముట్టజెప్పాలని స్థానిక విఆర్‌ఒలు డిమాండ్ చేస్తున్నారని రైతులు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆర్‌డిఒ స్థానిక సీతారామయ్య తో కలిసి సచివాలయంలో రీసర్వే సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం చేపట్టారు. మెట్టూరు, చీపుపరుపల్లి రెవెన్యూ పరిధిలో ఏర్పడిన భూ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఒకే పేరుతో ఒక ఎల్‌పిఎం నంబరుతో పలువురు రైతుల భూముల నమోదు కావడం, ఆధార్, 1బి, అడంగల్, ఆస్తులు వివరాల్లో తప్పులు ఉన్నట్లు గుర్తించినట్లు రెవెన్యూ అధికారులు చెప్పారు. వివిధ రకాల సమస్యలపై 17 ఫిర్యాదులు అందినట్లు చెప్పారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ఎవ్వరకీ డబ్బులు ఇవ్వనవసరం లేదని ఆర్‌డిఒ స్పష్టం చేశారు. ఏవైనా ఇబ్బందులుంటే నేరుగా కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న ఆర్‌డిఒ వెంకటేష్

క్రీడల్లో రాణించాలి

ఎమ్మెల్యే రమణమూర్తి

ప్రజాశక్తి- పోలాకి

విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. మండలంలోని మబగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గస్థాయి స్కూల్, గ్రిగ్ క్రీడా పోటీలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ధైర్యసాహసాలు, నాయకత్వ లక్షణాలు పెంపొందించే శక్తివంతమైన వేదికని కొనియాడారు. నరసన్నపేట నియోజవర్గం నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయికి వెళ్లే క్రీడాకారులు మరింత సంఖ్యలో రావాలని ఆశించారు. అందుకు అవసరమైన ప్రోత్సాహం, మాలిక వసతులు ప్రభుత్వ అందిస్తుందని ప్రతి విద్యార్థి క్రీడల చురుగ్గా పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోవాలన్నారు. అనంతరం విధివిధ ఆటలు పోటీలు పాల్గొనే విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణన్నాయుడు, శిమ్మ చంద్రశేఖర్, మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, భైరి భాస్కర రావు, హెచ్‌ఎం రాధాకృష్ణ, గొద్దు చిట్టిబాబు, టిడిపి పట్టణ అధ్యక్షులు కింజరాపు రామారావు, రావాడ గణపతిరావు, కాయ రవి, దుంగ సీతారాం, మెండ వేణు, వనమాలి జగదీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ వైఫల్యం

- **దళారుల దోపిడీతో దగా పడుతున్న రైతులు**
- **మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం**

సమావేశంలో మాట్లాడుతున్న తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - ఆమదాలవలస

ధాన్యం కొనుగోలులో టిడిపి కూటమి ప్రభుత్వం విఫలమైందని మాజీ స్పీకర్, వైసిపి శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త తమ్మినేని సీతారాం విమర్శించారు. పట్టణంలోని తన నివాసంలో గురువారం విలేకరుల సమావేశంలో ధాన్యం కొనుగోలు విధానంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన కొనుగోలు విధానం లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దళారుల దోపిడీకి గురవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా మధ్యవర్తులు, దళారులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆధిపత్యం చెలాయిస్తున్నారని ధ్వజమెత్తారు. బరువు, తేమ పేరుతో మోసాలు చేస్తున్నా ప్రభుత్వం మౌనం వహిస్తోందని మండిపడ్డారు. పంట నాణ్యత ఎంత బాగున్నా ధరలో అయాచిత కోతలు విధించడం వల్ల రైతులు నష్టాలను చవిచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

వసూళ్లపై విచారణ చేయాలి

జిల్లాలో ధాన్యం కొనుగోలు వ్యవస్థ పూర్తిగా అవినీతిమయమైందని ఆరోపించారు. మిల్లర్లు, అధికారులు, మిల్లర్ల యూనియన్ ప్రతినిధులు రైతులను బహిరంగంగా దోచుకుంటున్నారని మండిపడ్డారు. ధాన్యం కొనుగోలులో మిల్లర్లు 3 నుంచి 4 కిలోల వరకు అదనంగా తీసుకుంటున్నారని రైతుల నుంచి ఫిర్యాదులు వస్తున్నా, పౌరసరఫరాల శాఖ అధికారులు చేతులు ముడుచుకుని కూర్చుంటున్నారని దుయ్యబట్టారు. ఒక్కో బియ్యం లారీపై సివిల్ సప్లై అధికారులు రూ.2,500 వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు రావడం బాధాకరమని, ఈ డబ్బులు ఎవరి ఖాతాలోకి వెళ్తున్నాయో నిగ్గు తేల్చాలన్నారు. జిల్లాలోని గోదాములన్నీ ఎఎస్‌డబ్ల్యుసి ద్వారా అద్దెకు తీసుకున్నా, నిర్వహణ బాధ్యత ఓనర్లకే అప్పగించడంతో, వారు ఒక్కో బియ్యం లారీపై రూ.400 వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మిల్లులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బిల్లులపై 10 శాతం పన్ను ముసుగులో మంత్రి సోదరులు, వారి అనుచరులు అసోసియేషన్ పేరుతో రూ.ఎనిమిది కోట్లు వసూలు చేశారన్న ఆరోపణలు వెలుగులోకి వచ్చాయని, దీనిపై సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు.

రైతుల పక్షాన పోరాటం

కలెక్టర్ ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకపోవడం, జెసి స్థాయిలో ఫిర్యాదులను పట్టించుకోకపోవడం వల్లే అవినీతి విలయ తాండవం చేస్తోందని ఆరోపించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని, ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల పక్షాన నిలబడడం ప్రభుత్వ బాధ్యత అని, దాన్ని విస్మరిస్తే రైతుల పక్షాన తామే పోరాటం చేస్తామని హెచ్చరించారు. మద్దతు ధర అమలయ్యే విధంగా మిల్లుల కార్యకలాపాలను ప్రభుత్వం పర్యవేక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైసిపి రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్ పాల్గొన్నారు.

అరసవల్లిలో టెండర్ల నాటకం

ప్రజాశక్తి - అరసవల్లి

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో రథసప్తమి వేడుకల్లో యాత్రికులు ఆశ్రయం పొందడానికి ఆలయం వద్ద పందిరిలతోనే సరిపెడతారా? అన్న అనుమానాలు కలుగుతున్నాయి. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు రెండు నెలల్లో అరసవల్లి ఆదిత్యుని ఆలయ రూపురేఖలు మారుస్తామని హామీ ఇచ్చారు. కానీ, ఇప్పటికే సుమారు నెల దాటిపోయినా ఇంతవరకు ఒక ఇంచి పనీ జరగలేదు. ఎక్కడా ఒక శంకుస్థాపన కూడా చేపట్టిన దాఖలాలు లేవు. పైగా పూర్వం ప్రసాదాల భవనం, అన్నదాన సత్రం తదితర భవనాలు ఉన్నచోట హుటాహుటిన పందిళ్లు వేసి సరిపుచ్చుకోవడంపై పలువురు విమర్శిస్తున్నారు. ఈ పందెరిలు నిర్మాణం వల్ల యాత్రికులు దీపారాధన చేసే సమయంలో ఏమైనా ప్రమాదాలు సంభవిస్తాయోమనని ఆలయ సిబ్బందికి కంటి మీద కునుకు లేకుండా ఉంది. హుటాహుటీన పందిళ్లు ముందు వేసి, తర్వాత టెండర్లకు పిలవడం కూడా అనుమానాలకు దారితీసింది. ఇదిలా ఉండగా ఇటీవల టెండర్లలో గొప్యత ఎక్కువ అవుతున్నాయి. ప్రతి పనిలోనూ అవకతవకలు చోటుచేసుకుంటున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ సంఘటనలు అన్ని విషయాలూ కావాలనే ఆలయ ఇఒ, సిబ్బంది నాటకాల వల్లే జరుగుతున్నాయని పలువురు అభియోగం. టెండర్లు వేసేటప్పుడు కనీసం నెల ముందుగా ప్రకటనలిచ్చి టెండర్లకు పిలవాల్సి ఉంది. అయితే ఈ ఆలయంలో అలా జరగడం లేదు. అనేకసార్లు ఈ విషయంపై చర్చలు వచ్చిన ఆలయ అధికారుల నిర్లప్తత కనిపిస్తుంది. టెండర్లు ప్రక్రియ ఒక నాటకంలా సాగుతుంది. ఆలయ సిబ్బంది నచ్చిన వారికి టెండర్లను కట్టపెట్టేందుకు ఈ విధంగా వాయిదా వేస్తూ వస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. టెండర్లు ఉన్నాయని ప్రకటనలు ఇవ్వకపోవడం, ఆ టెండర్లకూ కొద్దిరోజుల సమయం మాత్రమే ఇవ్వడం వల్ల, వచ్చిన వారికి టెండర్లను ఖరారు చేయకపోవడం, ఆ టెండర్లను రద్దు చేయడం ఇలాంటి సంఘటనలు జరగడానికి కారణం సిబ్బందేనని ఆరోపిస్తున్నారు. రానున్న రథసప్తమి వేడుకల కోసం టెండర్లను సక్రమంగా నిర్వహించాలని కోరుతున్నారు. వచ్చే ఏడాది తలనీలాల కొనుగోలు, సెల్‌ఫోను, బ్యాగులు, కెమేరాలు భద్రపరిచే లైసెన్సులు, శానిటేషన్ సామగ్రికి, కూరగాయలు, ఆకుకూరలు, పాలు, పెరుగు, ప్రసాదం, కవర్లకు, విద్యుత్ మెటీరియల్, స్వామివారి చిత్రపటాలకు, నిత్య అలంకరణ పూజా సామగ్రికి, లడ్డు, పులిహార ప్రసాదాలు ప్యాకింగ్‌కు చింతపండు, శనగపిండి, ప్రసాదం తరలించేందుకు టెండర్లను పిలిచిన సమయం సక్రమంగా ఇవ్వలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొంతమందే టెండర్లకు వచ్చినా వారికీ అవకాశం ఇవ్వకుండా ఆలయ అధికారులు నాటకం ఆడుతున్నారని టెండర్లదారులు ఆరోపిస్తున్నారు. టెంపరరీ మరుగుదొడ్లకు, బారిగేడ్లకు, టెండర్ల కోసం ఆహ్వానించినా అధికారుల తీరు బాగు లేక ఘర్షణలు పడి తిరిగి వెళ్లిపోయిన పరిస్థితులు కనిస్తున్నాయి. పలుమార్లు వాయిదాలు వేయడం వల్ల ఏదో జరుగుతుందని పలువురు చర్చించుకుంటున్నారు. కొన్ని టెండర్లు కనీసం చర్చించకుండా వాయిదా వేసిన సందర్భాలు ఉన్నాయి. అధికారులు అనాలోచితి నిర్ణయాలు, అవగాహన లోపాల కారణంగానే టెండర్ల ప్రక్రియ సక్రమంగా జరగడం లేదని ఆరోపిస్తున్నారు. ఇదేవిధంగా ఇఒ ఆధ్వర్యాన ఇటీవల పందెళ్లు కూడా ఎవరికి టెండర్లకు ముందుగా పిలవకుండా నిర్మాణాలు చేపట్టారు. నిర్మాణాలు చేపట్టిన తర్వాత టెండర్లకు పిలవడం కూడా పలు అనుమానాలకు దారితీస్తున్నాయి. అదేవిధంగా షాపులు ఇవ్వడంలోనూ లెక్కకుమించి షాపులు ఇస్తున్నారని, ఇష్టమైన వారికి ఇస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. యాత్రికులూ నడవడానికి ఉండడానికి సరైన ప్రదేశం లేకుండా దుకాణాలకు అనుమలు ఇస్తున్నారు. అదేవిధంగా ప్రతి ఆదివారం, ఉత్సవాల్లో సేవకుల నియమాకమూ పలు అనుమానాలు దారితీస్తున్నాయి. ఇఒకు తెలియకుండా సేవకులను కొంతమంది ఆలయానికి పంపిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై సిబ్బందిని అడగగా, తాము 20 మందివరకే అనుమతిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా గోశాలలో ఉన్న ఒక లేగ దూడ కూడా చనిపోయే పరిస్థితికి ఆలయ సిబ్బందే కారణమని పలువురు ఆరోపిస్తున్నారు. ఈసారైనా టెండర్ల విషయంలో అధికారులు శ్రద్ధ చూపాలని, పారదర్శకంగా టెండర్లు నిర్వహించాలని కోరుతున్నారు.

టెండర్లకు పిలవకుండా ముందుగా వేసిన పందిరి

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

మహాసభలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- రణస్థలం

డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరిగే సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. జనవరి 4న విశాఖపట్నం ఆర్.కె.బీచ్ వద్ద జరిగే భారీ బహిరంగ సభలో యావన్మంది కార్మిక వర్గం, అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన తదితర స్కీమ్ వర్కర్స్ పాల్గొనాలని కోరారు. పైడిభీమవరంలో సిఐటియు కార్యాలయంలో సిఐటియు అఖిల భారత మహాసభ పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్లకు మేలు చేసేందుకు, కార్మిక వర్గం హక్కులను హరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకుంటున్నాయని, ఈ విధానాలకు వ్యతిరేకంగా బలమైన కార్మిక ఉద్యమాన్ని నిర్మించడంలో సిఐటియు అగ్రభాగాన నిలిచిందన్నారు. దేశంలో వివిధ రంగాల కార్మికులను, సంఘాలను ఐక్యం చేసి బలమైన కార్మికవర్గ పోరాటాలను నిర్మించడానికి జరిగే సిఐటియు అఖిలభారత మహాసభలు దోహదపడతాయన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పనిగంటలు పెంచుతూ చట్టం చేయడం దుర్మార్గమన్నారు. కార్మికులకు నష్టం చేసే, యాజమాన్యాలకు లాభం చేకూర్చేవిధంగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ఖండించారు. అంగన్వాడీ, ఆశ తదితర స్కీమ్ వర్కర్లకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు వెలమల రమణ, వెంపడాపు లక్ష్మణరావు, ఎం.నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న విఆర్‌ఎలు

ఉద్యోగోన్నతులు కల్పించాలి

ప్రజాశక్తి- కొత్తూరు

విఆర్‌ఎలకు ఉద్యోగోన్నతులు కల్పించాలని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం మండల నాయకులు దొర్నాన అనిల్, గణపతిరావు కోరారు. తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో విఆర్‌ఒల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. నైట్ డ్యూటీలు రద్దు చేయాలన్నారు. తెలంగాణా రాష్ట్రంలో అమలవుతున్న విధంగా జీతాలు చెల్లించాలన్నారు. కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ మాట్లాడుతూ నామినీలను విఆర్‌ఎలుగా గుర్తించాలన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో జీతాలు పెంచాలని విజయవాడ చౌక్ వద్ద ధర్నా నిర్వహించినప్పుడు అప్పటి ప్రతిపక్ష నాయకులు, ప్రస్తుత సిఎం నారా చంద్రబాబునాయుడు సంఘీభావం తెలిపారని అన్నారు. ఆ సమయంలో టిడిపి అధికారంలోకి రాగానే విఆర్‌ఎల రూ.15 వేలుకు పెంచామని హామీనిచ్చారని అన్నారు. అధికారంలోకి 18 నెలలు అవుతున్నా... సమస్యలు పరిష్కరించలేదని తెలిపారు. పైగా బలవంతంగా నైట్‌వాచ్‌మెన్ డ్యూటీలు చేయిస్తుంచారని అన్నారు. విఆర్‌ఎలకు 8 ఏళ్లుగా జీతాలు పెరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యేకు వివరిస్తున్న కిరణ్‌కుమార్

ఎమ్మెల్యే దృష్టికి గిరిజన సమస్యలు

మెళియాపుట్టి: మండలంలోని గిరిజన సమస్యలను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దృష్టికి గిరిజన జనసేన మండల నాయకులు, లక్ష్మీపురానికి కిరణ్‌కుమార్ తీసుకెళ్లారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం పలు ప్రజా సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. మండలంలోని గిరిజన ప్రాంతాల్లో ఎదురవుతున్న సమస్యలు తీవ్రస్థాయికి చేరాయరని అన్నారు. డిఆర్‌డిపో భవనాలు శిథిలావస్థకు చేరుతున్నాయని తెలిపారు. ఇందులో డబారు, అచ్చినాపురం, నేలబొంతు మరమ్మతులు చేయాల్సి ఉందన్నారు. అలాగే హీరాపురం, బందపల్లి, చింతల పోలూరు శిథిలావస్థలో ఉన్నాయి. నెలబొంతు, గొట్టిపల్లి, నందవ, భరణికోట రహదారులు దయనీయ స్థితిలో ఉన్నాయని అన్నారు. పలు గ్రామాల్లో తాగునీటి కొరత తీవ్రమైందని తెలిపారు. సమస్యలను పూర్తిగా విన్న ఎమ్మెల్యే వెంటనే సంబంధిత శాఖాధికారులతో ఫోన్‌లో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ఇంటి పన్ను వసూలు వేగవంతం

నందిగాం : ఇంటి పన్ను వసూలు వేగవంతం చేయాలని డిఎల్‌పిఒ ఐ.వి.రమణ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో గురువారం సమావేశం నిర్వహించారు. అలాగే స్వామిత్వ పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్న నాన్ టాక్స్, తదితర విషయాలపై సమీక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ టి.హరికృష్ణ, కార్యదర్శులు పాల్గొన్నారు.

బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ

ఇచ్ఛాపురం : మండలంలోని కె.శాసనంలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో బాలింతలకు పౌష్టికాహారానికి ఎంపిపి బోర పుష్ప గురువారం పంపిణీ చేశారు. అనంతరం కేంద్రంలో కొయ్య నీరజ కుమారుడు హిమాన్స్‌కి అక్షరాభ్యాసం చేశారు. ఎలిమెంటరీ స్కూల్‌లో వంటశాల పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'నాడు-నేడు' టైల్స్ మాయంపై విచారణ

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండలంలోని కొత్తకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాయమైన నాడు నేడు ఫ్లోరింగ్ టైల్స్ ఫిర్యాదుపై గురువారం జిల్లా ఉప విద్యాశాఖ అధికారి ఎం.విజయకుమారి విచారణ చేపట్టారు. ఇటీవల రొట్టవలసకు చెందిన తాడేల రాజారావు అనే వ్యక్తి కొత్తకోట ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అక్రమాలపై జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై విచారణ చేపట్టిన జిల్లా విద్యాశాఖ అధికారులు కొత్తకోట ఉన్నత పాఠశాలకు చేరుకొని ముందుగా నాడు నేడు నిర్మాణాలు, తరగతి గదులను పరిశీలించారు. అనంతరం హెచ్‌ఎం గదిలో టైల్స్ మాయంపై విచారణ నిర్వహించగా పాఠశాల నైట్ వాచ్‌మెన్ కోవిలాపు సూర్యం, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకురాలు లక్ష్మి నుంచి వివరాలు సేకరించారు. పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న వ్యక్తి పాఠశాల సెలవు రోజుల్లో పాఠశాలకు వచ్చి మరో వ్యక్తులతో కలిసి కారుతో రావడం జరిగిందని తెలిపారు. టైల్స్‌ను ప్రాంతానికి చెందిన వ్యక్తి సహాయంతో టైల్స్ బాక్సులు ఎక్కించుకొని హిందీ మాస్టారు వెళ్లిపోతుండగా తాను అడిగినప్పటికీ కారు ఆపకుండా వెళ్లిపోయారని లక్ష్మి విచారణలో తెలిపారు. ఇదే విషయాన్ని నైట్ వాచ్‌మెన్ అయిన తన భర్తకు తెలియజేసి వెంటనే హెచ్‌ఎంకు, మండల విద్యాశాఖ సిఆర్‌పికి ఫిర్యాదు చేయడం జరిగిందని వాచ్‌మెన్ సూర్యం కూడా విచారణలో తెలియజేశారు. అనంతరం పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాస్‌తో పాటు మిగిలిన ఉపాధ్యాయుల వద్ద కూడా హిందీ ఉపాధ్యాయుడు తమ అభిప్రాయాలను ఒక్కొక్కరి నుంచి లిఖిత పూర్వకంగా డిప్యూటీ డిఇఒ వివరాలు సేకరించారు.

ఆరోపణలు ఎదుర్కొంటున్న కొత్తకోట ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు

టీచర్‌కు రాజకీయాలు ఎందుకు?

టి. రాజారావును డిప్యూటీ డిఇఒ విజయకుమారి వివరణ కోరారు. ఆ సమయంలో రాజారావు విచారణ ఇష్యూ నాపై ఫిర్యాదారుడు రాజకీయ కక్షతో తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడని తెలిపిన సమయంలో ఆమె అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఒక ఉపాధ్యాయుడికి రాజకీయాలు ఎందుకని మందలించారు. తమ స్వగ్రామ మైన రొట్టవలసలో కలెక్టర్కు ఫిర్యాదు చేసిన వ్యక్తులకు తమకు భూతగాదాలు ఉన్నాయని వాటిపై తాను న్యాయ స్థానాన్ని ఆశ్రయించానని అందుకే తనపై తప్పుడు ఆరోపణలతో ఫిర్యాదు చేస్తున్నట్లు హిందీ ఉపాధ్యాయుడు రాజారావు విచారణలో వివరణ ఇచ్చారు. కొత్తకోట ఉన్నత పాఠశాలలో హిందీ

డిఇఒ ఆదేశాల మేరకు చర్యలు

ఉపాధ్యాయునిపై జరిగిన విచారణ విషయాలను జిల్లా విద్యాశాఖ అధికారికి నివేదించడం జరుగుతుందని డిప్యూటీ డిఇఒ తెలిపారు. కొత్తకోట ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న వ్యక్తి విధులకు సమయపాలన పాటించకుండా వ్యక్తిగత సంపాదన, రాజకీయ వ్యవహారాలతో పాటు పాఠశాలకు చెందిన నాడు నేడు టైల్స్ మాయం, విద్యార్థుల యూనిఫారం క్లాత్ తరలింపు ఇతర ఆరోపణలతో జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేసిన అంశాలపై విచారణ చేపట్టడం జరిగిందన్నారు. ఈ విచారణలో వాచ్‌మెన్, ఆయన భార్య మధ్యాహ్న భోజనం నిర్వాహకులు లక్ష్మి, పాఠశాల హెచ్‌ఎం, ఇతర ఉపాధ్యాయులతో విచారణ నిర్వహించి వారి వాంగ్మూలాలను తీసుకోవడం జరిగిందన్నారు. ఫిర్యాదు దారుడు అందుబాటులో లేకపోవడంతో ఆయన వచ్చిన తర్వాత విచారణ రాతపూర్వకంగా తీసుకొని జిల్లా విద్యాశాఖ అధికారికి నివేదికను పంపించి ఆయన ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆమె తెలిపారు.

విచారణ అనంతరం పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని డిప్యూటీ డిఇఒ పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే ఉపాధ్యాయులు కూడా విద్యా బోధనతో పాటు మధ్యాహ్న భోజన పథక నాణ్యత, పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని ఆమె హెచ్‌ఎంకు సూచించారు. ఈ విచారణలో జిల్లా విద్యా శాఖ కార్యాలయ ఎస్‌ఎ బొడ్డేపల్లి శ్రీనివాసరావు, మండల విద్యాశాఖ అధికారులు డి.బాలరాజు, కె. శ్రీనివాసరావు, సిఆర్‌ఎంటి చిరంజీవి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు రాజారావుని ప్రశ్నిస్తున్న డిప్యూటీ డిఇఒ

గుండెపోటుతో యువకుడు మృతి

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

సంతోష్ (ఫైల్)

మండలంలోని లక్కివలస ఎంపిటిసి చింతల రాజులు కుమారుడు చింతల సంతోష్ (26) అనే మత్స్యకార యువకుడు స్వగ్రామానికి వస్తూ రైలులో మార్గమధ్యంలో గుండెపోటుతో గురువారం మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే... పిజి జియాలజిస్టు విభాగంలో హిమాచల్‌ప్రదేశ్‌లో సంతోష్ ఉద్యోగం చేస్తున్నారు. అక్కడి నుంచి స్వగ్రామం గెద్దలపాడుకి రావడానికి బుధవారం రైలులో బయలుదేరారు. మార్గమధ్యంలో గురువారం ఉదయం నాగపూర్ సమీపంలో వచ్చేసరికి రైల్లో గుండెపోటుతో రావడంతో సంతోష్ అక్కడికక్కడే మృతి చెందారు. కుమారుడు మృతి విషయం తెలియడంతో తల్లిదండ్రులు రాజులు, లక్ష్మి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. చేతుకు అందివచ్చిన కొడుకు హఠాత్తుగా మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. శుక్రవారం మృతదేహం స్వగ్రామానికి చేరుతుందని స్థానికులు అంటున్నారు.

మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

వరి కుప్పలు దగ్ధం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మున్సిపాలిటీలోని ఆరోవార్డు పరిధిలో కాళింగ మన్నయ్యపేటలో గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం అర్ధరాత్రి వరి కుప్పలకు మంట పెట్టి దగ్ధం చేశారు. వివరాల్లోకి వెళితే సువ్వారి స్వామినాయుడు, కూన మోహనరావు ఇరువురు రైతులకు చెందిన 90 సెంట్లు పొలంకు చెందిన వరి కుప్పలకు నిప్పు పెట్టడంతో మంటలకు కాలి బూడిదయ్యాయి. రైతులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి తెలియజేయడంతో అగ్నిమాపక శకటం హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పారు. అప్పటికే వరికుప్పలు మొత్తం కాలిపోయి బూడిదయ్యాయి. గురువారం ఉదయం రైతులు మంటలను చూసి లబోదిబోమంటూ కన్నీరు మున్నీరుగా విలపించారు. గత ఏడాది కూడా ఇదే గ్రామంలో గురుగుబెల్లి రాజశేఖర్ అనే రైతుకు చెందిన 60 సెంట్లు పొలంలో పండిన వరి కుప్పలను కూడా ఇదే విధంగా దగ్ధం చేశారని, అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు ఉదాసీనంగా వ్యవహరించడంతో ఈ ఏడాది కూడా అదే మాదిరిగా వరికుప్పలను దహనం చేశారని గ్రామానికి చెందిన పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వరికుప్పల దగ్ధం వెనక గతంలో చొక్కాకుల బంధ ఆక్రమణలు తొలగించడం వలననే ఈ విధంగా వరికుప్పలను దగ్ధం చేస్తున్నారని పలువురు రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వరి కుప్పలు దగ్ధంపై రైతులు స్వామినాయుడు, మోహనరావు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంఘటనా స్థలానికి ఎఎస్‌ఐ టి.శ్రీనివాసరావు చేరుకొని దగ్ధమైన వరికుప్పలను పరిశీలించారు. ఈ ఘటన పరిశీలనలో అగ్నిమాపక అధికారి బొడ్డేపల్లి హరినారాయణ, విఆర్‌ఒ ఇంద్ర, టిడిపి నాయకులు పాతిన వెంకటరమణ, గురుగుబెల్లి రాజశేఖర్, నీటిసంఘం మెంబర్ పైడి శ్రీనివాసరావు తదితరులున్నారు.

18న ఎన్‌జిఒ పట్టణ కార్యవర్గం ఎన్నిక

శ్రీకాకుళం సిటీ: స్థానిక ఎన్‌జిఒ హోంలో ఈ నెల 18న శ్రీకాకుళం పట్టణ తాలుకా ఎన్‌జిఒ కార్యవర్గం ఎన్నికలు జరగనున్నాయని జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12న నామినేషన్ల ప్రక్రియతో మొదలవుతుందని, ఈ నెల 13న నామినేషన్ల విత్ డ్రా చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. 18న ఎన్నికలు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఎన్నికల అధికారిగా ఆర్.వేణుగోపాల్ (జిల్లా ఉపాధ్యక్షులు, ఎపి ఎన్‌జిఒ శ్రీకాకుళం), సహాయ ఎన్నికల అధికారిగా ఎజెఎం రాధాకృష్ణ (జిల్లా సంయుక్త కార్యదర్శి, ఎపిఎన్‌జిఒ శ్రీకాకుళం) వ్యవహరించనున్నారన్నారు. జిల్లాలో జరిగిన 12 తాలుకా ఎన్నికలు సజావుగా సాగాయని, ఐక్యతకు మారుపేరుగా నిలిచాయని, సంబంధిత కార్యవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు తన తరపున ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎపి ఎన్‌జిఒ సభ్యత్వం ఉన్న అన్ని శాఖల ఉద్యోగులూ పాల్గొని, ఎన్నికల నిర్వహణకు సహకరించి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

పనులు పరిశీలిస్తున్న కూటమి నాయకులు

రాపాకలో సిసి రహదారి పనులు

పొందూరు: మండలంలోని రాపాకలో సిసి రహదారి, కాలువల నిర్మాణ పనులను గురువారం కూటమి నాయకులు చేపట్టారు. గ్రామంలోని కొంచాడ శ్రీరాములు ఇంటి నుంచి రాయికా చెరువు వెళ్లే కాలువ గట్టు, కల్వర్టు, సిసి రహదారి నిర్మాణానికి రూ.5 లక్షలతోను, కొంచాడ శ్రీరాములు ఇంటి నుంచి పిసిని వారి కళ్లం వరకూ రూ.8.50 లక్షలతో సిసి రహదారి, కాలువల నిర్మాణం పనులు చేపట్టనున్నారు. ఈ పనుల కోసం జెసిబితో మట్టిని తొలగించే పనులను చేపట్టారు. టిడిపి జిల్లా తెలుగు యువత జనరల్ సెక్రటరీ బలగ శంకర భాస్కరరావు, మండల తెలుగు యువత అధ్యక్షుడు కండాపు శ్రీనివాసరావు, టిడిపి నాయకులు శ్రీనివాసరావు, చంటి, కృష్ణ పాల్గొన్నారు.

జగదీష్ ను అభినందిస్తున్న సిబ్బంది

మేజరు పంచాయతీ ఇఒగా జగదీష్

పొందూరు: స్థానిక మేజర్ పంచాయతీ ఇఒగా పొన్నాడ జగదీష్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన మండలంలోని దల్లవలస కార్యదర్శిగా పనిచేస్తూ గ్రేడ్-2 పదోన్నతి లభించడంతో పొందూరు ఇఒగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఇఒ కింతలి మోహన్ బాబు డిప్యూటీ ఎంపిడిఒగా పదోన్నతి పొంది మన్యం జిల్లా సీతంపేట బదిలీపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన ఇఒ జగదీష్‌ను ఇక్కడ పనిచేసిన ఇఒ మోహన్‌బాబు, పంచాయతీ, మూడు సచివాలయాల సిబ్బందిలు, మండల టిడిపి అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అన్నెపు రాము, తెలుగుయువత జిల్లా కార్యదర్శి బలగ శంకరాభాస్కరరావు, పిఎసిఎస్ చైర్మన్ వండాన మురళీ, టిడిపి పట్టణ అధ్యక్షుడు శ్రీరంగనాయకులు, టిడిపి నాయకులు బాడాన శేషగిరి నాయుడు, తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

వ్యర్థాలను తగలబెడుతున్న విద్యార్థులు

తీరంలో చిన్నారుల శ్రమదానం

కవిటి: పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని కళ్యాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ బిందు మాధవి అన్నారు. మండలంలోని పుక్కలపాలెం సముద్ర తీరంలో ఉన్న సభకు తోటల్లో గురువారం విద్యార్థులు శ్రమదానం నిర్వహించారు. సరుగుడు తోటలతోపాటు తీరంలో పడిన ప్లాస్టిక్, వాటర్ బాటిల్స్ వంటి చెత్తను ఏరిపారవేసి 'ప్రకృతిని కాపాడుదాం' అంటూ నినాదాలు చేశారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ పిక్నిక్‌కు వచ్చే ప్రతిఒక్కరూ చెత్తను బాధ్యతగా పారేయాలన్నారు. పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నిబంధనలకు తూట్లు

ఇచ్ఛాపురం: పట్టణంలో నడిబొడ్డు ఉన్న స్వేచ్ఛ మద్యం షాపు నిబంధనలకు తూట్లు పొడుస్తూ అమ్మకాలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కానీ, ఎక్సైజ్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోక చోద్యం చూస్తున్నారని పలువురు విమర్శలు చేస్తున్నారు. మద్యం షాపుకు అతి సమీపంలో ఆలయం, ప్రైవేట్ ఆస్పత్రులు, బంగారు నగలు షాపులతో నిత్యం రద్దీగా ఉంటుంది. పర్మిట్ రూమ్ ఉన్నా... ఆరు బయట మద్యం సేవించడం, షాపు వద్ద అపరిశుభ్రత వాతావరణంలో ఆహార పదార్థాలు అమ్మకాలు చేపడుతున్నారు. రద్దీగా ఉండే ఈ మద్యం షాపులో జోరుగా సాగుతున్న అమ్మకాలు, మద్యంలో కల్తీ చేస్తున్నట్లు పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు మాత్రం ఇక్కడ మద్యం శాంపిల్ తీసుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆరు బయట మద్యం అమ్మకాలు నిరోధించకోవడం అధికారుల తీరుపై మండిపడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా చొరవ తీసుకుని ఈ షాపులో మద్యం అమ్మకాలు, ఆహార పదార్థాలు పరిశీలించాలని పలువురు కోరుతున్నారు.

మద్యం షాపు

నెహ్రూ పార్కు పరిశీలన

ప్రజాశక్తి- పలాస

పలాస మున్సిపాలిటీ పరిధిలోని నెహ్రూ పార్కును గురువారం ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు పరిశీలించారు. పలాస మున్సిపాలిటీ పరిధిలోని ముత్యాలమ్మ కోనేరును పలాస మున్సిపాలిటీ నూతన కమిషనర్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కోనేరు సుందరీకరణకు సంబంధించిన పనులు, అక్కడ సమస్యలు తెలుసుకుని ఎమ్మెల్యే గౌతు శిరీష దృష్టిలో పెడతానని అన్నారు. పట్టణం ఆధునీకీకరణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సప్ప నవీన్, డొక్కరి శంకర్, యవ్వారి మోహనరావు మాస్టర్, గాలి కృష్ణారావు, జన అప్పారావు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

బిసి హాస్టల్ తనిఖీ

పార్కును పరిశీలిస్తున్న బాబూరావు

పలాసలోని మహాత్మా జ్యోతిరావు పూలే బిసి సంక్షేమ పాఠశాలను బాబూరావు తనిఖీ చేశారు. ప్రిన్సిపాల్‌తో మాట్లాడి మౌలిక సదుపాయాలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. వంటగది, హాస్టల్ పరిసరాలు పరిశీలించారు.

ప్రదర్శనలో సేంద్రియ ఉత్పత్తులు చూస్తున్న ఇన్‌ఛార్జి కమీషనర్

ప్రకృతి సిద్ధమైన వస్తువులు వాడాలి

ప్రజాశక్తి- అరసవల్లి

ప్రకృతి సిద్ధమైన వస్తువులు, ఆహార పదార్థాలు వాడడం వలన సహజ జీవన విధానాలను అలవర్చుకోవడం జరుగుతుందని నగర ఇన్‌ఛార్జి కమిషనర్ పృథ్వీరాజ్ అన్నారు. మన శ్రీకాకుళం ప్రకృతి సిద్ధపరమైన జీవన విధానానికి పుట్టినిల్లు అని అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అఫ్ పీడియాట్రిక్స్ బృందం పాల్గొన్నారు. సిక్కోలు హరిత మహోత్సవం పూర్తి చేసుకొని చిన్న పిల్లల హ్యాండ్లూమ్ డ్రెస్ కాంపిటీషన్, అదేవిధంగా యోగా టీచర్ తంగి స్వాతి, దూసి అన్నపూర్ణ, హిమబిందు, పేర్ల అనురాధ తదితరులు సిక్కోలు మహిళా ఫ్యాన్సీ, సాంప్రదాయ వస్త్రాధారణ వేషాధారణలో ఎంతగానో అలరించారు. పలు ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు సిక్కోలు హరిత మహోత్సవ ప్రదర్శనలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

పర్యావరణం, ఆరోగ్యం, సహజ జీవన విధానాల ప్రోత్సాహానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని చీఫ్ ఆర్గనైజర్ ఎన్.విజయ్ కుమార్, సెక్రటరీ దార్లపూడి రవి అన్నారు. కో చైర్‌పర్సన్స్ నటుకుల మోహన్, గీతా శ్రీకాంత్, ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ డా. వండాన సుచిత్ర, శాప్ ప్రెసిడెంట్ డా.వి.శ్రీరామ్మూర్తి, సెక్రెటరీ డా.వినోద్ కుమార్ ప్రత్యేక చొరవతోనే ఈ మహోత్సవం విజయవంతమైందన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులకు, స్టాల్స్ ఏర్పాటులో కృషిచేసిన అనురాధకు సత్కరించారు. ముగింపు కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యుల బృందం, నగర వైద్యులు, అధికారులు, స్వచ్ఛంద సేవాసంస్థ సభ్యులు, స్థానికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

శివానీలో ఎలక్ట్రికల్ వర్క్‌షాప్

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండలంలోని చిలకపాలెం శ్రీశివాని కాలేజ్ అఫ్ ఇంజనీరింగ్‌లో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (ఇఇఇ) విభాగం ఆధ్వర్యంలో గ్రీన్‌వియాన్ ఎనర్జీ టెక్నాలజీస్, హైదరాబాద్ వారితో కలిసి సంయుక్తంగా నిర్వహిస్తున్న 'సోలార్ పివి సిస్టమ్స్ రూపకల్పన'పై ఐదు రోజుల మెగా వర్క్‌షాప్ ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ముడి సరుకులు అంతరిస్తున్న తరుణంలో ప్రస్తుత విద్యుత్ రంగంలో సౌరశక్తి ప్రాముఖ్యతను, విద్యార్థులకు వివరించారు. ఈ సోలార్ విద్యుత్ పునరుత్పాదక శక్తి రంగంలో ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉన్న అపారమైన అవకాశాలను వివరించారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ బి.పురుషోత్తం ఆచారి ఈ వర్క్‌షాప్ ముఖ్య ఉద్దేశాన్ని, రాబోయే ఐదు రోజుల్లో విద్యార్థులకు ఏయే అంశాలు నేర్పించబడతాయో తెలియజేశారు. భవిష్యత్ సౌరశక్తిదేనని, సిస్టమ్ రూపకల్పన అనేది కేవలం సైద్ధాంతిక అంశం కాదని, ఆచరణాత్మకంగా దీనిని అధ్యయనం చేయడం ద్వారానే పూర్తి నైపుణ్యం వస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.టి.చంద్రశేఖర్, విభాగాధిపతులు ఎం.సాయి సుధ, డాక్టర్ ఎస్.లక్ష్మణరాజు, కోఆర్డినేటర్లు డాక్టర్ ఎ.క్రాంతి, ఐ.సాయి రాజేష్ కుమార్, టిపిఒ డాక్టర్ బి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీనివాసరావు

కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

రసవత్తరంగా క్రీడా పోటీలు

వజ్రపుకొత్తూరు: మండలంలోని నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన 76వ నియోజకవర్గ స్థాయి అంతర పాఠశాలల క్రీడా పోటీలు రసవత్తరంగా సాగాయి. ముందుగా ఈ క్రీడా పోటీలను ఎంపిడిఒ రమేష్ నాయుడు, ఎంఇఒ వెంకటరమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఈ పోటీల్లో బాలికల జూనియర్ విభాగంలో ఖోఖో, వాలీబాల్, టెన్నికాయిట్ పోటీలో కెజిబివి పాఠశాల జి.ఆర్.పురం (మందస మండలం), బాల్‌బాడ్మింటన్ క్రీడలో జెడ్‌పిహెచ్ స్కూల్ కాశీబుగ్గ విద్యార్థులు సత్తాచాటారు. అలాగే సీనియర్ విభాగం కబడ్డీ, ఖోఖో క్రీడలో ఎంజెపి స్కూల్ పలాస, వాలీబాల్ పోటీలో జెడ్‌పిహెచ్ స్కూల్ పాతటెక్కలి, టెన్ని కాయిట్, బాడ్మింటన్ పోటీలో బాలికల హైస్కూల్ పలాస విద్యార్థులు విజేతలుగా నిలిచారు. కాగా, బాలుర జూనియర్ విభాగంలో వంద మీటర్లు పరుగు పందెం ప్రథమ స్థానంలో బి.కేసిక్ (బొడ్డపాడు), సీనియర్ విభాగంలో బి.కుమారస్వామి (నగరంపల్లి) 200 మీటర్లు జూనియర్‌లో బి.విజయ కుమార్ (నగరంపల్లి, సీనియర్లో బి.కుమారస్వామీ (నగరంపల్లి), 400 మీటర్ల జూనియర్ ఎస్.జశ్వంత్ (పెదంచల), సీనియర్‌లో డి.మధు (గోవిందపురం), 800 మీటర్లు జూనియర్ వై.గంగదర్ సాయి (బ్రహ్మణతర్లా), 1500 మీటర్లులో జూనియర్ బి.సతీష్ (గోవిందపురం), సీనియర్ విభాగంలో ఎస్.కేశవరావు (బ్రహ్మణతర్లా). అలాగే లాంగ్ జంప్ క్రీడల్లో జూనియర్‌లో జి.లక్ష్మణరావు (కాశీబుగ్గ), సీనియర్‌లో బి.కుమారస్వామీ (నగరంపల్లి), హై జంప్‌లో జూనియర్ ఎన్.ప్రహర్ష (చినబడాం) సీనియర్‌లో బి.భీమారావు (హుకుంపేట), షార్ట్‌పుట్ జూనియర్ ఎస్.మనోజ్ (కాశీబుగ్గ), సీనియర్‌లో డి.భరత్ (వివేకనంద గోవిందపురం), జావిల్లింగ్ త్రో జూనియర్‌లో ఎం.ప్రవీణ్ (హరిపురం), సీనియర్ బి.కిరణ్ (నగరంపల్లి), ట్రిపుల్ జంప్ జూనియర్‌లో ఎం.తనీష్ (కాశీబుగ్గ), సీనియర్‌లో ఎస్.కేశవరావు (బ్రహ్మణతర్లా) క్రీడల్లో క్రీడాకారులు సత్తాచాటి ప్రథమ స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో సర్పంచ్ దువ్వాడ పద్మావతి, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు దువ్వాడ హేమబాబుచౌదరి, ఎంపిటిసి ప్రతినిధి బమ్మిడి మోహనరావు, ప్రధానోపాధ్యాయులు టి.హేమారావు, ఎస్ఎంసి చైర్మన్ బి.లక్ష్మీపతి, పీడిలు పైల గజేంద్ర, జె.నారాయణ, తవిటయ్య, కె.హరిబాబు, జయరాం చౌదరి, ఉపేంద్ర, చక్రవర్తి, అప్పారావు, నీలారావు పాల్గొన్నారు.

లావేరు : రైతులకు అవగాహన కల్పిస్తున్న రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధులు

మొక్కజొన్న సాగుతో లాభం

ప్రజాశక్తి- లావేరు

దుక్కి దున్నకుండానే మొక్కజొన్న సాగుతో అధిక లాభాలు సాధించవచ్చునని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సీనియర్ ఏరియా మేనేజర్ తవిటినాయుడు అన్నారు. మండలంలోని వెంకటాపురం, పెద్దలింగావలస తదితర గ్రామాల్లో అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డబుల్ వీల్ మార్కర్ ఉపయోగించి తక్కువ వ్యయంతో అధిక దిగుబడులు సాధించవచ్చునని చెప్పారు. ఈ విధానం ద్వారా రైతులకు దుక్కి ఖర్చు లేకుండా పదిరోజులు ముందు పంట చేతికి వస్తుందన్నారు. దీంతో ఎకరానికి రూ. ఐదువేలు ఆదా అవుతుందన్నారు. రెండు విడతలుగా నీరు ఆదా అవుతుందని చెప్పారు. ఈ విధానాన్ని రైతులు పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో రైతులు, రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్తలు యినపకుర్తి అనిల్ కుమార్, ఎస్.సాయిదుర్గ తదితరులు పాల్గొన్నారు.

పంట వ్యర్థాలను కాల్చొద్దు

రణస్థలం: పంట వ్యర్థాలను కాల్చడం వలన నేలకు, అటు పర్యావరణానికి నష్టం వాటిల్లు తోందని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సీనియర్ ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు అన్నారు. మండలంలో వివిధ గ్రామాలకు వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించి ఖరీఫ్ సీజన్‌లో వరి కోసిన అనంతరం పంట పొలాల్లో నూర్పిడి తర్వాత మిగిలే వ్యర్థాలు కాల్చకూడదని, దాని వలన పర్యావరణానికి హాని జరుగుతుందని, నేలలో కార్బన్ శాతం తగ్గుతుందని, పంట అవశేషాలను కాల్చడం ద్వారా వచ్చే దూళి, పొగవలన మానవాళికి శ్వాసకోస సమస్యలు వస్తాయన్నారు. నేల ఉపరితల నుంచి ఒక సెంటీమీటర్‌లోపు వరకు ఉష్ణోగ్రత ఎనిమిది డిగ్రీలు పెరిగి నేలలో పంటకు మేలు చేసే బ్యాక్టీరియా ఫంగస్ నాశనం అవుతుందన్నారు. కాల్చడం వలన వెలువడే కార్బన్ డయాక్సైడ్, మిథైన్, నైట్రస్ ఆక్సైడ్ వలన వాతావరణంలో వేడి అధికమవుతుందని, నేల ఉపరితలంలో నత్రజని, భాస్వరం, పొటాష్, సేంద్రీయ కార్బనం నష్టపోతాయని రైతులకు సూచించారు. నేలలో తేమను పరిరక్షించే దిశగా మల్చింగ్‌గా ఉపయోగపడుతుందన్నారు. అలాగే పంట అవశేషాల్లో విలువైన ఎన్.పి.కెతో పాటు సూక్ష్మ పోషకాలు ఉంటాయని, డాక్టర్ రెడ్డీస్ పంట వ్యర్థాల నిర్వహణ సమన్వయకర్త బి.అరుణ కుమార్ అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్త కె శివకేష్, పి.రమణ, రైతులు పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

పొందూరు : విద్యార్థినులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

బూర్జ: మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ధర్మాన కృష్ణవేణి అన్నారు. ఆమదాలవలసలో జరిగిన నియోజక వర్గస్థాయి ఆటల పోటీల్లో (గ్రిగ్స్) హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరచారన్నారు. కబడ్డీ, షాట్‌పుట్, పరుగు పందెం తదితర ఆటల పోటీల్లో సత్తా చాటారన్నారు. అంతేకాకుండా ఓవరాల్ ఛాంపియన్ షిప్ సాధించారని తెలిపారు. పోటీల్లో గెలుపొంది బహుమతులు సాధించిన విద్యార్థులను, పీడీ ఎం.సురేష్‌కుమార్‌ను గురువారం అభినందించారు.

పొందూరు: ఆమదాలవలస పట్టణంలో నియోజకవర్గం పాఠశాల గ్రిగ్స్ పోటీల్లో మండలంలోని లోలుగు కెజిబివి విద్యార్థినులు సత్తాను చాటారు. జూనియర్స్ విభాగంలో వాలీబాల్, 100 రిలే, 400 మీటర్స్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో పోటీల్లో ప్రథమ స్థానం, 800 మీటర్స్, షాట్‌పుట్, డిస్కస్ త్రో, లాంగ్‌జంప్‌ల పోటీల్లో ద్వితీయస్థానం, 1500 మీటర్లు పరుగుపందెంలో తృతీయ స్థానం సాధించారు. అలాగే సీనియర్స్ విభాగంలో వాలీబాల్, షాట్‌పున్, డిస్కస్ త్రో పోటీలో ప్రథమ స్థానం, షాట్‌పుట్, డిస్కస్ త్రో, 100 మీటర్లు పరుగుపందెంలో తృతీయ స్థానం సాధించారు. దీంతో స్పోర్ట్స్ చాంపియన్‌షిప్, ఆల్‌రౌండ్ చాంపియన్ షిప్‌లను కెజిబివి విద్యార్థినులు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రిగ్స్ పోటీలో రాణించి సత్తాచాటిన విద్యార్థినులను ప్రిన్సిపాల్ సిహెచ్.లలితకుమారి, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.రూపవతి, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

బూర్జ : విద్యార్థులతో హెచ్‌ఎం కృష్ణవేణి తదితరులు


విద్యార్థులతో మాట్లాడుతున్న డిఇఒ రవిబాబు

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

ప్రజాశక్తి- పొందూరు

జిల్లాలో పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రణాళికలను అమలు చేస్తున్నట్లు డిఇఒ కె.రవిబాబు అన్నారు. మండలంలోని తోలాపి, పిల్లలవలస జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలను గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పదోతరగతిలో శతశాతం ఉత్తీర్ణతకు అమలు చేస్తున్న 100 రోజుల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయా పాఠశాలల్లో 100 రోజుల కార్యక్రమంలో అమలు చేస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. సిలబస్‌ను సకాలంలో పూర్తిచేయడంతో పాటు, ప్రతి అధ్యాయం ముగిసిన వెంటనే చిన్న పరీక్షలను నిర్వహించాలని సూచించారు. అలాగే రోజువారీ ప్రణాళికలను ఉపాధ్యాయులు పక్కాగా అమలుతో పాటు, ముఖ్యమైన ప్రశ్నల జాబితాను ఉపాధ్యాయులు రూపొందించాలని పేర్కొన్నారు. అన్ని సబ్జెక్టుల్లో ప్రత్యేక తరగతుల నిర్వాహణతో పాటు వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే ఎసెస్‌మెంట్ పుస్తకాలను ఆయన పరిశీలించారు. ఈయనతో పాటు హెచ్‌ఎం ఉమామహేశ్వరి, బి.గొల్లవాడు తదితరులున్నారు.

కుట్టుమిషన్ పంపిణీ చేస్తున్న లక్ష్మణరావు తదితరులు

కుట్టుమిషన్ పంపిణీ

ప్రజాశక్తి- అరసవల్లి

సత్యసాయి పెద్ద మందిరంలో ఎంబ్రాయిడింగ్‌లో శిక్షణ పొందిన మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవాసమితి రాష్ట్ర అధ్యక్షులు ఆర్. లక్ష్మణరావు మాట్లాడుతూ సత్యసాయి సేవాసమితి ద్వారా పేద మహిళలకు, వృద్ధులకు సేవ చేయడమే ప్రధాన్యత ఇస్తామన్నారు. రిమ్స్ ఆస్పత్రిలో అనేక మంది రోగులకు, రోగులకు సహాయం చేసిన వారికి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా తెలిపారు. రాష్ట్రస్థాయిలో సత్యసాయి సేవా మందిరాల్లో విద్యాబోధన కొరకు ప్రత్యేక పాఠశాలలు కూడా ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి మందిరంలో పేద విద్యార్థులకు, అనాథలకు ప్రత్యేక ట్యూషన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి జిల్లా అధ్యక్షులు ఎస్.రామచంద్రరావు, జోనల్ కన్వీనర్స్ రమణబాబు, లింగరాజు, మందిరం కన్వీనర్ మురళి తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న బ్రాంచ్ మేనేజర్ నేతాజీ

బీమా పాలసీలపై అవగాహన

ప్రజాశక్తి- నరసన్నపేట

అనిశ్చిత సమాజంలో జీవిత బీమా కీలక పాత్ర పోషిస్తుందనినరసన్నపేట ఎల్ఐసి బ్రాంచి మేనేజర్ ఎం.నేతాజీ అన్నారు. జీవితానికి రక్షణ కల్పించడం కోసం ఎల్ఐసి ప్రజలకు ఎంతో సహాయం చేస్తోందని తెలిపారు. ఆన్ ది జాబ్ ట్రైనింగ్ లో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల నరసన్నపేట ఒకేషనల్ విద్యార్థులకు నేతాజీ గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవితానికి రక్షణ సామాజిక భద్రతే ధ్యేయంగా సంస్థ పనిచేస్తోందని అన్నారు. తాము చేపడుతోన్న కార్యకలాపాలపై అవగాహన కల్పించారు. నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పవన్ మరపట్ల సూచనలతో ఒకేషనల్ విద్యార్థులకు ఎల్ఐసిలో రెండో రోజు ఒజెటి కార్యక్రమం నిర్వహించామని జిల్లా కమిటీ సభ్యులు దుగ్గివలస రాంప్రసాద్, అధ్యాపకులు కొర్రాయి రవి పేర్కొన్నారు. జీవితబీమా పాలసీలు, సరెండర్ విలువ లెక్కించడం, బీమా క్లైముల విభాగం పనితీరు, అకౌంట్స్ విభాగం, సామాజిక బాధ్యత కింద సంస్థ అందిస్తున్న సబ్సిడీలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

అస్తవ్యస్తంగా అండర్ డ్రైనేజీ వ్యవస్థ

ప్రజాశక్తి- నరసన్నపేట

పట్టణంలోని శివనగర కాలనీ కూడలిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పాడవ్వడంతో మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తుంది. ఆ నీరు కాస్త ఇంటి ముందు నిల్వ ఉండడంతో దుర్గంధ భరితంగా దుర్వాసన వెదజల్లుతుంది. ఈ విషయమై పలుమార్లు పంచాయతీ అధికారులకు స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియజేశారు. అయినా మొక్కుబడిగా వచ్చి చూసి వెళ్లిపోతున్నారే తప్ప పరిష్కారం చూపడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ డ్రైనేజీ ద్వారా వచ్చే మురుగు తాగునీటిలో కలుషితమై అనారోగ్యానికి గురవుతున్నామని స్థానికులు ఆరోస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పరిష్కార మార్గం చూపాలని స్థానికులు కోరుచున్నారు.

కేంద్రమంత్రిని విమర్శించే స్థాయి లేదు

శ్రీకాకుళం సిటీ: కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడును విమర్శించే స్థాయి వైసిపి నాయకులకు లేదని ఎపిఇడబ్ల్యుఐడి చైర్మెన్ పిఎంజెబాబు, మాజీ జిల్లా టిపిడి అధ్యక్షులు చౌదిరి నారాయణమూర్తి, బిఆర్ఆర్ వంశధార ప్రాజక్టు చైర్మెన్ అరవల రవీంద్ర, పట్టణ పార్టీ అధ్యక్షులు పాంద్రంగి శంకర్ అన్నారు. జిల్లా టిడిపి కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఇండిగో సంస్థ వ్యక్తిగత కారణాలు వల్ల విమానాలు రద్దయ్యాయని, కేంద్ర మంత్రికి సంబంధం లేదన్నారు. సమస్య పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం, మంత్రి కృషి చేశారన్నారు. పూర్తిగా సమస్య పరిష్కారం దిశగా ఉందని చెప్పారు. ప్రజలు బుద్ధి చెప్పినా వైసిపిలో మార్పులేక పోవటం దురదృష్టకరమన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ముమ్మరంగా నూర్పులు

యంత్రంతో వరినూర్పు చేస్తున్న రైతులు

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలో వరికోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. జూన్, జులైలో వెదపద్ధతిలో సాగుచేసిన భూముల్లో పంట చేతికి వచ్చింది. గత వారం నుంచి కోతలు ప్రారంభించండంతో పాటు, పొలాల్లోనే నూర్పు యంత్రాలతో నూర్పులు కూడా ముమ్మరంగా చేస్తున్నారు. మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 7,200 ఎకరాల్లో వరిసాగు చేశారు. వర్షాభావం, సకాలంలో నీరందని పరిస్థితుల వల్ల కొన్ని ప్రాంతాల్లో దిగుబడులు భారీగా తగ్గనున్నాయని తెలిసింది. అనువైన వాతావరణం ఉండటంతో రైతులు కోతలు ప్రారంబించారు. ఇప్పటికే వ్యవసాయ, అర్ధకగణాంక, ప్రణాళిక శాఖల అధికారులు పంటకోత ప్రయోగాలు చురుగ్గా నిర్వహిస్తున్నారు. పంటను కోసి నూర్పు చేసి అక్కడికక్కడే తూకం వేసి ధాన్యం దిగుబడి అంచనాలను రూపొందిస్తున్నారు. ఈ ప్రయోగాల్లో వచ్చిన సమాచారం ప్రకారం నీటి ఎద్దడి ఇబ్బంది లేని పలు గ్రామాల్లో ఎకరాకు 40 బస్తాల దిగుబడి వస్తోందని అంచనా వేశారు. వర్షాభావం, సకాలంలో నీరందకపోవడం, చివరి భూముల్లో పంట ఎదుగుదలలో జాప్యం జరగడం తదితర కారణాల వల్ల ఖరీఫ్‌లో సగటు దిగుబడి కంటే తక్కువ రావచ్చునని అంచనా వేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో దిగుబడి బాగా తక్కువగా వస్తుందని చెబుతున్నారు. అయితే రైతులు కోసి కుప్పలు వేస్తున్నారు. ఎక్కువ మంది రైతులు ఇప్పటికిప్పుడే నూర్పిడి చేయకుండా పొలాల్లో కుప్పలు వేస్తున్నారు. వరికోతలు కోసిన వెంటనే రెండో పంటగా చాలా మంది మినుము, పెసర, శనగ సాగుకు ఉద్యుక్తులువుతున్నారు. నీటి ఎద్దడిలేని ప్రాంతాల్లో మొక్కజొన్న సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

కూలీల కొరత అధిగమించేందుకు మొగ్గు

వ్యవసాయం పూర్తిగా వ్యయసాయంగా మారుతున్న ప్రస్తుత తరుణంలో రైతులు సాగు ఖర్చు తగ్గించుకునే విధంగా అలోచిస్తున్నారు. ముఖ్యంగా వ్యవసాయ కూలీల కొరతతో పాటు కూలీల ధరలు పెరగడంతో రైతులు యాంత్రీకరణవైపు మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా వరి పంటలో యాంత్రీకరణను వినియోగించుకుంటున్నారు. వరి పంటలో కోత సమయంలో సాగు ఖర్చు పెరిగింది. యంత్రాల ద్వారా వరికోతలు చేపట్టడం వల్ల రైతులకు డబ్బులు కూడా ఆదా అవుతున్నాయి. జిల్లాలో ముమ్మురంగా వరి కోతలు జరుగుతున్నాయి. దీంతో జిల్లాలోని అన్ని మండలా ల్లోనూ వరి కోత యంత్రాల ద్వారా వరి పంటను కోస్తున్నారు. అలాగే నూర్పు యంత్రాలతో నూర్పులు చేస్తున్నారు.

కోతలు కోసిన వరిపంట

ఘనంగా శ్రీకాంత్ జన్మదినం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో తూర్పు కాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ మామిడి శ్రీకాంత్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వేణుగోపాల స్వామి ఆలయం వద్ద శ్రీకాంత్ జన్మదిన వేడుకలు నిర్వహించి కేకును కట్ చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వాస్పత్రిలోని రోగులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ప్రతినిధి పాడి అప్పారావు, సర్పంచ్‌లు పెద్దింటి చంద్రరావు, గణేష్ ప్రధాన్, బోసి రామారావు, ఎంపిటిసిలు ఉర్లాన రుషి, ఎఎంసి మాజీ డైరెక్టర్ గండేటి చిన్న, నక్క వెంకటరావు, దుర్యోధన, జడ్డేటి కృష్ణ పాల్గొన్నారు.

కొత్తూరు : కాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీకాంత్ జన్మదిన వేడుకలను వైసిపి నాయకులు పిన్నింటి రామారావు నాయుడు, జడ్డు రామకృష్ణ, ఎడ్ల గోవిందరావు బుర్ల శ్రీను, సింహాద్రిలు స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

వికసించిన బ్రహ్మ కమలాలు

ప్రజాశక్తి- అరసవల్లి

కొన్నవీధిలో రాధాకృష్ణ నగర్‌లో ఉన్న గాయత్రి అపార్ట్‌మెంట్‌లో బిహెచ్ స్వాతి గృహంలో బ్రహ్మ కమలాల పూలమొక్కలు 20, 30 వరకు ఉన్నాయి. అవి ఎప్పుడూ లేని విధంగా సుమారు 50 వరకు బ్రహ్మ కమలాలు వికసించాయి. ఇది సీజనల్‌గా ఇదే కాలంలో బ్రహ్మ కమలాలు వికసిస్తాయని ఆమె తెలిపారు.

మ్యాప్‌ను పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

ప్లాంటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ

పోలాకి: ఫారెస్టు భూముల్లో ప్లాంటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఫారెస్టు ప్రత్యేక పరిశీలకులు కె.శ్రీనివాసరావు ఆదేశించారు. మండలంలోని జోగంపేట, కొత్తరేవు ఫారెస్టు భూములను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఫారెస్టు ల్యాండ్ హద్దులు, తోటల్లో ఉన్న చెట్లు, నైసర్గిక స్వరూపం మేప్ ద్వారా పరిశీలించి వివరించారు. అలాగే ఉన్న చెట్లను తొలిగించకుండా, ఆక్రమణలు జరగకుండా పరిశీలించాలని ఆదేశించారు. ప్రస్తుత టెక్నాలజీ ప్రకారం ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో నరసన్నపేట సెక్షన్ అధికారాలు ఎస్.శ్రీనివాస్, రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

కోటబొమ్మాళి: సచివాలయ అధికారులు సమయపాలన పాటించి తమకు అప్పజెప్పిన బాధ్యత సక్రమంగా నిర్వహించాలని టెక్కలి డిఎల్‌పిఒ అరివేలు మంగమ్మ అన్నారు. అమె గురువారం కోటబొమ్మాళి 1,2 సచివాలయాలను సందర్శించి పలు రికార్డులు పరిశీలించారు. సచివాలయ అధికారులు పనితీరు కొంత అసంతృప్తిగా ఉందని, వెంటనే మెరుగు పర్చుకోవాలని లేకుంటే చర్యలు తీవ్రంగా ఉంటాయని వివరించారు. కార్యదర్శి చింతాడ సన్యాసిరావు, విఆర్ఒ రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శిక్షణ

కవిటి: ఎన్ఆర్ఎల్ఎం కార్యాక్రమం కింద మూడో విడతలో మండల సమాఖ్యను మోడల్ మండలంగా ఎంపిక చేశారు. విజన్ బిల్డింగ్‌లో భాగంగా నిర్వహిస్తున్న శిక్షణ మూడో రోజు గురువారం మండల మహిళా సమాఖ్య భవనంలో నిర్వహించారు. ఎపిఎం గోవిందరావు ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఈ శిక్షణలో మండల సమాఖ్య అధ్యక్షులు, కార్యాలయ సిబ్బంది, విఒఎలు, విఒ అధ్యక్షులు శిక్షణలో పాల్గొన్నారు. నాలుగు రోజుల పాటు కొనసాగే ఈ శిక్షణలో మండల సమాఖ్య అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, లక్ష్యాల రూపకల్పన, ప్రణాళికా కార్యాచరణలపై అవగాహన కల్పించారు. సిసి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పెద్దవీధిలో వైసిపి ఇన్‌ఛార్జి లోకనాథ్ బెహరా తండ్రి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు మృతుని కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు జెడ్‌పిటిసి మాజీ సభ్యులు హరిప్రసాద్, వల్లభ వైకుంఠరావు, డి.నాగభూషణం ఉన్నారు.

విజేతలకు జ్ఞాపికలు అందజేత

ప్రజాశక్తి- కొత్తూరు

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల 10 నుంచి 12 వరకు వరకు నియోజకవర్గస్థాయి బాలబాలికల గ్రిగ్స్ పోటీలు నిర్వహించారు. గురువారం ఆటల్లో గెలుపొందిన విద్యార్థులకు వైస్ ఎంపిపి లోతుగడ్డ తులసీవరప్రసాదరావు విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో లోతుగెడ్డ లక్ష్మీనారాయణ నాయుడు, పడాల వెంకటకృష్ణ, కనపాకల నారాయణలు పాల్గొన్నారు.

సిపిఎస్‌ను తక్షణమే రద్దు చేయాలి

సిపిఎస్ రద్దు కోరుతూ నినాదాలు చేస్తున్న ప్రతినిధులు

ప్రజాశక్తి- అరసవల్లి

కంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీంను తక్షణమే రద్దు చేయాలని, అది పాలకులకు పెన్షన్ అని... మాకు మాత్రం టెన్షన్ అని ఎపిసిపిఎస్ఇఎ రాష్ట్ర అధ్యక్షులు బాజీపఠాన్ అన్నారు. సిపిఎస్ రద్దు కోరుతూ ఎపిసిపిఎస్ఇఎ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మే 1 నుంచి నిర్వహిస్తున్న చైతన్యయాత్రలు డిసెంబరు 10 జిల్లా పర్యటనతో ముగిసిందన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిపిఎస్ విధానం వల్ల ఉద్యోగులకు తీవ్ర నష్టం కలుగుతుందని, సిపిఎస్ రద్దు కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేశామని చెప్పారు. సిపిఎస్ చాలా దుర్మార్గమైనదని, కూటమి ప్రభుత్వం ఏర్పాటై 18 నెలలు గడుస్తున్నా ముఖ్యమంత్రిగానీ, ఉపముఖ్య మంత్రిగానీ ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమన్నారు. 26 జిల్లాల్లో ఆయా కలెక్టర్ల ద్వారా వినతిపత్రాలు అందజేసినా ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేదన్నారు. కేవలం ఉద్యోగులను ఇబ్బందులు పెట్టాలన్న ఆలోచనతోనే సిపిఎస్ విధానాన్ని తీసుకొచ్చిందని, సిపిఎస్ రద్దుపై ఈ ప్రభుత్వానికి కూడా ఇచ్చిన గడువు ముగిసిపోయిందని, ఇప్పటికైనా సిపిఎస్‌ను రద్దు చేయకుంటే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని రాష్ట్ర జనరల్ సెక్రటరీ కరిమి రాజేశ్వరరావు హెచ్చరించారు. సిపిఎస్ వలన ఉద్యోగ, ఆర్థిక భరోసా లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవాధ్యక్షులు పి.రామాజనేయులు యాదవ్, బి.బాలకృష్ణ, కిరణ్, అబ్బాస్, జనార్ధనరెడ్డి, శాంతి బాయి తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలతో అనర్థాలు

బూర్జ : ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు

సరుబుజ్జిలి : అవగాహన కల్పిస్తున్న ఐసిడిఎస్ అధికారులు

ప్రజాశక్తి- బూర్జ

బాల్య వివాహాల వలన జరిగే అనర్థాలపై విద్యార్థినులకు అవగాహన అవసరమని సిడిపిఒ ఎస్.గీత అన్నారు. గురువారం మండలంలోని పాలవలస జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ముక్తాభారత్ వంద రోజుల కార్యక్రమాన్ని నిర్వహించారు. మైనర్లకు వివాహం జరిగితే ఎన్నో అనర్థాలు చోటు చేసుకుంటాయన్నారు. ముఖ్యంగా మహిళలకు నిబంధనల ప్రకారం యుక్త వయసు వచ్చిన తర్వాతనే వివాహం జరపాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లేక అతి చిన్నవయసులో వివాహాలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా అపోహాలు వీడి చిన్న వయసులో వివాహాలు జరపడం వల్ల జరిగే అనర్థాలను గుర్తించి బాల్యవివాహాలు జరగకుండా ప్రతిఒక్కరు బాధ్యతలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రుద్ర ప్రతాప్, అంగన్వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలన పై ర్యాలీ

సరుబుజ్జిలి: బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఐసిడిఎస్ అధికారులు గోనెపాడులో భారీ ర్యాలీ నిర్వహించారు. బూర్జ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఆ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించిన అనంతరం బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అమ్మనమ్మ, పాఠశాల హెచ్‌ఎం, మండల అంగన్వాడీ కార్యకర్తల సంఘ అధ్యక్షులు కె.జ్యోతి బాల్య వివాహాల వలన కలిగే నష్టాలు, గ్రామాల్లో అవగాహన కల్పించాల్సిన విషయాలను విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఐసిడిఎస్ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జెండర్ క్యాంపెయిన్‌పై అవగాహన

ప్రజాశక్తి - జి.సిగడాం రూరల్

స్వయం సహాయక సంఘాల సభ్యులకు నెల రోజుల పాటు జెండర్ క్యాంపెయిన్‌పై అవగాహన కల్పించాలని ఎపిఎం రెడ్డి రామకృష్ణ అన్నారు. మండలంలోని పాలఖండ్యాంలో జెండర్ క్యాంపెయిన్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సంఘాలు, స్వయం సహాయక సంఘాలు ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి వారం ఆమె పనిచేయడం ద్వారా భారతదేశం అభివృద్ధి, రెండో వారం అవకాశాలు సమానత్వానికి మార్గాల సృష్టి, మూడో వారం భద్రమైన మార్గాలు అభివృద్ధి సోపానాలు, నాలుగో వారం ఇంటి పని అందరివనే అంశాలపై కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు వివరించారు.

జి.సిగడాం : ర్యాలీలో పాల్గొన్న ఎపిఎం రామకృష్ణ

జెండర్ రిసోర్స్ సెంటర్ ప్రారంభం

కోటబొమ్మాళి: లింగ వివక్షత లేని సమాజ నిర్మాణమే జెండా రిసోర్స్ సెంటర్ లక్ష్యమని, సమాజంలో స్త్రీ పురుష బేధం లేకుండా అందరూ సమానత్వంతో ఉండాలని కళింగ కోమటి చైర్మన్ బోయిన గోవిందరాజు అన్నారు. మండల సమైక్య కార్యాలయంలో జెండర్ రిసోర్స్ సెంటర్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జెండారు రిసోర్స్ సెంటర్ వల్ల కుటుంబ తగాదాలు పరిష్కారంతోపాటు భార్యాభర్తల మధ్య వివాదాలకూ కౌన్సెలింగ్ ద్వారా పరిష్కరిస్తారని అనానరు. ఈ జెండర్ రిసోర్ సెంటర్లో మండల సమైక్య, పంచాయతీరాజ్, రెవెన్యూ, పోలీస్, విద్య, ఆరోగ్యం తదతర డిపార్ట్‌మెంట్ల సమన్వయంతో పనిచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, పిఎసిఎస్ అధ్యక్షులు వెలమల విజయలక్ష్మి, టిడిపి మండల అధ్యక్షులు బోయిన్ రమేష్, మాజీ ఎంపిపి తర్ర రామకృష్ణ, కర్రి అప్పారావు, సౌడాము ఎంపిటిసి పి.సిం హాచలం, జిల్లా సమైక్య అధ్యక్షులు పంగ భాను మతి, మండల సమైక్య అధ్యక్షులు మెండ సుశీలమ్మ, డిపిఎం నారాయణరావు, ఎపిఎం సూర్యనారాయణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గోవిందరాజులు

శక్తి యాప్‌పై అవగాహన

కోటబొమ్మాళి: విద్యార్థుల రక్షణకోసం ప్రభుత్వం అమలు చేస్తున్న శక్తి యాప్‌పై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని టెక్కలి డివిజన్ ఇన్‌ఛార్జి ఎం.గిరిధర్ ద్రాశ్యాణి అన్నారు. మండలంలోని కొత్తపల్లిశివం హైస్కూల్‌లో శక్తి-4 య్యాప్‌పై విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. పాఠశాల కరస్పాడెంట్ నౌపడ రామారావు, డెరెక్టర్ దుబ్బ శివాజీ నాయులు, ప్రిన్సిపాల్ రామగోపాలరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న శక్తి యాప్ సభ్యులు

పలాస : మహిళలు, బాలికల భద్రత కోసం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు శక్తిటీమ్ అవగాహన కల్పించింది. ఆపద సమయంలో ఎలా తమను తాము రక్షించుకోవాలి? చట్టాలపై అవగాహన, డ్రగ్స్‌పై అప్రమత్తత, రహదారి భద్రత తదితరాలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.నరసింహమూర్తి, శక్తిటీం ఇన్‌ఛార్జి, ఎఎస్ఐ ఎస్.భైరాగి, కానిస్టేబుళ్లు బి.ధనలక్ష్మి, కె.వాసుదేవరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు కొండల మధుబాబు, తమ్మినేని వాసుదేవరావు, తమ్మినాన పాపారావు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఇఒలు

ఎంఇఒల సందర్శన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మెళియాపుట్టి జెడ్‌పి హైస్కూల్‌ను ఎంఇఒ సవర దేవేందరరావు, మల్లారెడ్డి పద్మనాభరావు గురువారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థులకు రాష్ట్ర విద్యాశాఖ రూపొందించిన వంద రోజుల ప్రణాళిక అమలు పరిస్థితిని వారు ప్రత్యక్షంగా పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడిన అధికారులు, చదువు పద్ధతులు, ఉత్తీర్ణత సాధించడానికి అవసరమైన మెలకువలపై వారికి మార్గనిర్దేశం చేశారు. శతశాతం ఫలితాల సాధనకు ప్రధానోపాధ్యాయులు మహాలక్ష్మి, సహోపాధ్యాయులతో చర్చించి పాఠశాలలో ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. వంద రోజుల పాఠ్యప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. విద్యార్థులందరూ నిరంతరం హాజరు కావాలని అధికారులు సూచించారు. తరచూ గైర్హాజరవుతున్న ముస్లిమ్ స్ట్రీట్ ప్రాంతానికి చెందిన విద్యార్థుల ఇండ్లకు వెళ్లి, వారి తల్లిదండ్రులకు విద్య ప్రాధాన్యం వివరించి పాఠశాలకు పంపాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చిన్నబాబు, సహోపాధ్యాయులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ శరత్‌బాబు

ఇంటర్ ప్రవేశాలపై అవగాహన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చింతాడ శరత్‌బాబు ఇంటర్ ప్రవేశాల కోసం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన కల్పించారు. విద్యార్థులకు ప్రభుత్వ కళాశాలలో చేరికలపై చర్యలు చేపట్టారు. అందులో భాగంగా ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతంలో కొత్తశాసనం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం సందర్శించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్రమశిక్షణ, నాణ్యమైన విద్య, విద్యార్థుల భవిష్యత్‌కు బంగారుబాట వేస్తుందని అన్నారు. నీట్, ట్రిపుల్ ఐటి కాంపిటేటివ్ పరీక్షలకూ ఉచితంగా మెటీరియల్ అందిస్తుందని అన్నారు. క్రమశిక్షణ, అనుభవం ఉన్న అధ్యాపకులతో బోధన చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పైడి గోపాలరావు, ఉపాధ్యాయులు ఎస్.వి.కామేశ్వరరావు, అధ్యాపకులు బోరుభద్ర సురేష్‌కుమార్, పైడి సురేష్ కుమార్, నూకల రాజశేఖర్, హెణ్ని ప్రధాన్, చింతాడ పాపారావు, కె.మనోజ్, జ్యోతి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జడ్జి కిషోర్‌బాబు

ఎక్కువ కేసులు పరిష్కారం కావాలి

ప్రజాశక్తి- సోంపేట

ఈనెల 13న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ఆరో అదనపు జిల్లా జడ్జి కోడూరు కిషోర్‌బాబు కోరారు. స్థానిక కోర్టుల సముదాయం వద్ద గురువారం సోంపేట సర్కిల్ పరిధిలోని పోలీసు ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్రాఫిక్ చలానాలు కట్టనివి ఏమైనా పెండింగ్‌లో ఉంటే వాటిని లోక్ అదాలత్‌లో పెట్టి పరిష్కరి ంచాలన్నారు. ప్రమాదాలు, మనోవర్తి, కొట్లాట కేసులను ఎక్కువగా పరిష్కరించేలా చూడాలన్నారు. జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీనివాస్, సోంపేట సిఐ మంగరాజు, సోంపేట, కంచిలి, బారువ, మందస ఎస్ఐలు, ఎక్సైజ్ ఎస్ఐలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబంతో మాట్లాడుతున్న రాజేష్

రాజేష్ ఆర్థికసాయం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపాలిటీ 9వ వార్డు ముడియా వీధిలో నీరు పేద కుటుంబం జె.సరస్వతికి ఇద్దరు అబ్బాయిలు. అందులో ఒకరికి పుట్టుకతో మూర్ఛ వ్యాధితో బాధ పడుతున్నారు. ఆ కుటుంబం వైద్యం చేయించుకోవడానికి డబ్బులు లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆమె మున్సిపాలిటీ ఇన్‌ఛార్జి రోకల్ల భాస్కరరావు, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోల్ల రాజేష్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రాజేష్ స్పందించి గురువారం స్వయంగా బాధిత కుటుంబానికి పరామర్శించారు. అనంతరం నిత్యసర సరుకులు, వైద్యానికి కావాల్సిన నగదును అందజేశారు. అనంతరం ఇచ్ఛాపురానికి చెందిన కొండ శంకర్‌రెడ్డికి కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కడంతో రాజేష్ కలిసి అభినంది ంచారు. నరసింహరెడ్డి, గౌతమ్ రెడ్డి, దుర్గాసి, నీలవేణిరెడ్డి, చీకటి కృష్ణయ్య, కాకినాడ సంతోష్, బాలు పాల్గొన్నారు.

ఘనంగా భాషల దినోత్సవం

సోంపేట: సోంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ భాషల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. తమిళనాడుకు చెందిన మహాకవి సుబ్రహ్మణ్యం భారతి జన్మదినం పురస్కరించుకొని భాషలు వేరైనా భావం ఒకటే అనే స్ఫూర్తితో పాఠశాలకు చెందిన తెలుగు, ఇంగ్లీష్, హిందీ, ఒడియా భాషలకు చెందిన ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎంఇఒలు జోరాడు, కృష్ణంరాజు, ఒరియా డిఐ దుర్గాప్రసాద్ చౌదరి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు వేర్వేరు భాషలకు చెందిన వివిధ పోటీల్లో పాల్గొని తమ భాషాభిమానాన్ని చాటుకున్నారు.

భాషల ప్రాముఖ్యతను వివరిస్తున్న ఉపాధ్యాయులు